సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 13 । జనవరి । 2024



అన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి అన్నదాన పథకానికి ఇందుకూరి రామ కోటేశ్వరరాజు (భీమవరం) రూ.2.21.200 విరాళంగా అందజేశారు.




రాత బాగుంటే మార్కుల పంటే!

పరీక్షల్లో ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో, చేతిరాత కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

II లో

8,650 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా శేషసాయి



శేషసాయి

రాజమహేంద్రవరం సిటీ: కొవ్వూరు నియోజవర్గానికి చెందిన గంధం సీహెచ్ఆర్ శేషసాయిని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. వైఎస్సార్ సీపీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లే ప్రక్రియలో ప్రజలకు, పార్టీకి మధ్య వారధిలా ఉండాలని, పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

తాత్కాలిక స్ట్రాంగ్ రూము ఏర్పాటుకు భవనం పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలు, అనుబంధ యూనిట్ల భద్రతపై ముందస్తు ఏర్పాట్లను పరిశీలించామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూము ఏర్పాటుకు కలెక్టరేట్ ఆవరణలోని న్యాక్ అనుబంధ భవనాన్ని శుక్రవారం మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఎన్నికల సామగ్రితో పాటు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లను భద్రపరచి, పోలింగ్ తేదీకి ముందు రోజు పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి అందించాల్సి ఉంటుందని అన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత జిల్లాకు చెందిన అన్ని నియోజక వర్గాల బ్యాలట్ బాక్సులు, ఇతర ఓటింగ్ సామగ్రిని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూముకు తరలిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో తాత్కాలిక స్ట్రాంగ్ రూముతో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అనువైన భవనాలను గుర్తించి, ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందజేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు.



అన్నదాతల లోగిళ్లలో.. ఆనంద సంక్రాంతి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

వరి సాగు విస్తీర్ణం	:	1,75,011 ఎకరాలు
ధాన్యం కొనుగోలు లక్ష్యం	:	2,52,000 మెట్రిక్ టన్నులు
కొనుగోలు చేసినది	:	2,26,567 మెట్రిక్ టన్నులు
విక్రయించిన రైతులు	:	29,920 మంది
వారికి చెల్లించాల్సింది	:	రూ.495.81 కోట్లు
ఇప్పటి వరకూ చెల్లించినది	:	రూ.424.67 కోట్లు
ఇంకా చెల్లించాల్సింది	:	రూ.71.14 కోట్లు
కొనుగోలుకు చివరి తేదీ	:	15.01.2024

- తుపాను వేళ తడిసిన ధాన్యం సైతం కొన్న రాష్ట్ర ప్రభుత్వం
- అన్నదాతల ఖాతాల్లో ముందుగానే డబ్బుల జమ
- సీఎం చొరవతో చేతిలో దండిగా సొమ్ము
- నష్టం లేకుండా గట్టెక్కిన రైతులు
- ఇంటింటా ఆనంద కాంతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రైతుల లోగిళ్లలో సంక్రాంతి శోభ ఉట్టి పడుతోంది. ధాన్యం విక్రయించిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం కాస్త ముందుగానే జమ చేయడంతో.. ఈ పండగ వేళ వారి చేతిలో సొమ్ము ఆడుతోంది. తడిసి, ముద్దయి, రంగు మారిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయడంతో గట్టెక్కిన రైతులు సంతోషంగా కనిపిస్తున్నారు. రాష్ట్రానికి ధాన్యాగారంగా పేరొందిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏ మూల ఏ పల్లెలో చూసినా అన్నదాతల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది.

చి'వరి'లో ముంచిన మిచాంగ్

ఉమ్మడి జిల్లాలో 70 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. సంక్రాంతి పండగ వేళ పట్టణాలు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బంధుమిత్రులతో రైతులు, వ్యవసాయ కూలీల ఇళ్లు కళకళలాడుతూ ఉంటాయి. వచ్చిన వారికి మర్యాదలు చేయడంలో ఎక్కడా లోటు రాకుండా చూసుకోవడానికి ఇక్కడి వారు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారు. కొత్త అల్లుళ్లు, బంధుమిత్రుల కోసం పిండి వంటలు తయారు చేస్తారు. కొత్త దుస్తులు కొనుగోలు చేస్తారు. ఏటా సంక్రాంతి ముందు ఇదంతా జరిగేదే. అయితే ఇవన్నీ అనుకున్నది అనుకున్నట్టు జరగాలంటే ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట సొమ్ము సకాలంలో చేతికి రావాలి. మునుపెన్నడూ లేని రీతిలో గడచిన ఖరీఫ్ చివరిలో సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి మిచాంగ్ తుపానుతో పంటలకు నష్టం వాటిల్లింది. ముందుగానే నాట్లు వేసుకున్న మండపేట, రామచంద్రపురం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్ తదితర నియోజకవర్గాల్లోని రైతులు తుపాను గండం నుంచి తప్పించుకుని, గట్టెక్కారు. కోనసీమ ప్రాంతంలోని మండలాలు, కాకినాడ జిల్లాలోని కాకినాడ రూరల్, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట తదితర నియోజకవర్గాలతో పాటు తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా నాట్లు పడ్డాయి. ఆ పంటలకు మిచాంగ్ తుపానుతో నష్టం వాటిల్లింది. చేలల్లో, కళ్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యాన్ని చూసి రైతుల గుండెలు బరువెక్కాయి. ఈ నేపథ్యంలో ఈసారి సంక్రాంతి పండగ నిర్వహించుకోవడం కష్టమవుతుందని బెంగ పెట్టుకున్నారు.

రైతుకు మేలు చేసిన సీఎం జగన్

ఖరీఫ్ రైతులు కష్టాల్లో చిక్కుకున్నారని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు. తుపానుకు పంటలు నష్టపోయిన రైతులందరికీ మేలు చేసేలా తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసేలా విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా తుపాను వర్షాలకు తడిసి ముద్దయి, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనలు సడలించి మరీ కొనుగోలు చేసింది. అంతేకాకుండా వారం తిరగకుండానే పలువురు రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేసింది. ఆ రోజు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం.. ఈ పండగ వేళ తమ ఇళ్లల్లో ఆనంద సంక్రాంతి తీసుకువచ్చిందని రైతు కుటుంబాలు చెబుతున్నాయి.

24 గంటల్లోనే సొమ్ము వేసేశారు



ఐదెకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేశాను. మూడెకరాల పంట ముందుగా వచ్చింది. కోత కోసి ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తే 24 గంటల్లోనే సొమ్ములు మా అకౌంట్‌లో పడ్డాయి. ఇంత తొందరగా సొమ్ము పడతాయని కలలో కూడా ఊహించలేదు. మిగిలిన రెండెకరాల పంట తుపాను సమయంలో కోతకు వచ్చింది. మెషీన్‌తో కోత కోయిస్తూంటే వర్షం వచ్చింది. హడావుడిగా ధాన్యాన్ని గట్టు పైకి తెచ్చి బరకాలతో కప్పాం. కానీ, భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయింది. దీంతో చేతికొచ్చిన పంట నోటికి దక్కకుండా పోతుందనుకున్నాను. వర్షం తగ్గిన తరువాత అధికారులు వచ్చి, ధాన్యాన్ని బస్తాల్లో పట్టించి, మిల్లుకు ఆఫ్‌లైన్‌లో తరలించారు. ఐదు రోజుల్లోనే ధాన్యం సొమ్ములు నా అకౌంటులో పడ్డాయి. ఇంత బాగా చేస్తారని నేననుకోలేదు. ప్రభుత్వ చొరవతో ఈ సంక్రాంతి పండగను ఎంతో ఆనందంగా చేసుకోగలుగుతున్నాం. **– కోటిపల్లి రాంబాబు, రైతు, అన్నవరప్పాడు, పెరవలి మండలం**



సంక్రాంతి దగ్గర పడటంతో ఉప్పలగుప్తంలో గుమ్మంలో ఉన్న ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

కో‘ఢీ’.. కట్టడి



- సంక్రాంతి నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు
- గుండాట, జూదంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు
- ఇప్పటికే పోలీసుల స్పెషల్ డ్రైవ్
- భారీగా కోడి కత్తులు స్వాధీనం
- బరులు ఏర్పాటు చేసే ప్రాంతాలపై నిఘా

సాక్షి, రాజమహేంద్రవరం: సంక్రాంతి పండగ సమీపిస్తున్న వేళ.. కొక్కొరొకో.. అంటూ పందెం కోళ్లు నిద్ర లేపుతుంటే.. 'పంతం నీదా.. నాదా..సై..' అంటూ పందేల ప్రియులు బరుల తయారీకి, కత్తులు కట్టి పందాలు ఆడేందుకు ఒకవైపు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు వారిని కట్టడి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం.. ముఖ్యంగా పోలీసులు పక్కా వ్యూహంతో సిద్ధమవుతున్నారు. కోళ్లకు కత్తులు కట్టకుండా సంప్రదాయ పందేలు నిర్వహించుకోవచ్చు. అలా కాకుండా కత్తులు కట్టి కోడిపందేలు నిర్వహిస్తే మాత్రం కటకటాల్లో వేస్తామని నిర్వాహకులను హెచ్చరిస్తున్నారు. దీంతో పాటు గుండాట, జూదంపై కూడా ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేస్తున్నారు. వీటిని అడ్డుకునేందుకు జిల్లా కలెక్టర్ కె.మాధవీలత సైతం రెవెన్యూ, పోలీసు, సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా సమన్వయ అధికారులకు బాధ్యతలు అప్పజెప్పారు. ఇప్పటికే రంగంలోకి దిగిన పోలీసులు, రెవెన్యూ అధికారులు జిల్లా వ్యాప్తంగా బరులు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. పండగ ముసుగులో నిబంధనలకు విరుద్ధంగా కోడిపందేలు, గుండాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. కోళ్లకు కట్టే కత్తులను స్వాధీనం చేసుకుంటున్నారు. బరులు ఏర్పాటు చేసే స్థలాల యజమానులపై సైతం కేసులు తప్పవని స్పష్టం చేస్తున్నారు. పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. ఈ తరుణంలో పందేల నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది.

ఏటా 40కి పైగా బరుల్లో..

సంప్రదాయాలకు పుట్టినిల్లు తూర్పు గోదావరి. సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు ఎక్కడ ఉన్నా, ఏ ఊరిలో ఉద్యోగం చేస్తున్నా.. దాదాపు వారందరూ స్వగ్రామాలకు చేరుకుంటారు. అంబరాన్నంటేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించుకుంటారు. వీటిలో ప్రధానమైనది కోడిపందేలు. వీటి కోసం జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బరులు ఏర్పాటు చేస్తారు. ఈ పందేల్లో రూ.కోట్లలో నగదు చేతులు మారుతూంటుంది. కోడిపందేలు ఒక ఎత్తయితే వీటి ముసుగులో ఏర్పాటు చేసే గుండాట బోర్డులకు కూడా రూ.లక్షల్లోనే ఒప్పందాలు జరుగుతూంటాయి.

- అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, కుతుకులూరు, బిక్కవోలు, కొమరిపాలెం, బలభద్రపురం, రంగంపేట, వడిశలేరు, దొంతమూరు, సింగంపల్లి, పెదరాయవరం, దొడ్డిగుంట, రామేశ్వరం, జి.మామిడాడ, కాండ్రేగుల, పెదపూడి, గండ్రేడు తదితర 20కి పైగా ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.



సీతానగరం మండలం నాగంపల్లిలో కోడిపందేల బరులను ధ్వంసం చేయిస్తున్న తహసీల్దార్ కృష్ణారావు, ఎస్సై రామకృష్ణ

- రాజానగరం నియోజకవర్గం పుణ్యక్షేత్రం, ముక్కినాడ, నరేంద్రపురం, దివాన్ చెరువు, నిడిగట్ల, గాడాల, శ్రీరంగపట్నం, దోసకాయలపల్లి, గాదరాడ, రఘుదేవపురం, పెదకొండేపూడి, నల్గొండ, మిర్తిపాడు తదితర గ్రామాల్లో పందేలు ఏటా భారీ స్థాయిలో నిర్వహిస్తారు. రాత్రుళ్లు కూడా ఫ్లడ్ లైట్ల వెలుగులో పుంజులు తలపడుతూంటాయి.
- కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి, గజ్జరం, పెద్దేవం, రావూరుపాడు గ్రామాల్లో పందేలు జోరుగా నిర్వహిస్తారు. తాళ్లపూడి మండలంలో ఇప్పటికే 50 మందిపై బైండోవర్ కేసులు పెట్టారు.
- గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, యర్రగూడెం, బందపురం, యాజంపూడి, దొండపూడి, వెంకటాయపాలెం, గుడ్డుగూడెం, పోతవరం, ప్రకాశరావుపాలెం, అనంతపల్లి, కవులూరు గ్రామాల్లో ఏటా బరులు ఏర్పాటు చేస్తూంటారు.
- నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం ఖండవల్లి, అజ్జరం, ముక్కామల, నల్లాకులవారిపాలెం, పట్టల వేమవరం, ఉసులుమర్రు గ్రామాల్లో బరులు సిద్ధం చేస్తున్న వారిపై పోలీసు, రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. 142 మంది నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.
- రాజమహేంద్రవరం రూరల్‌లోని కడియపులంక, వేమగిరి, శాటిలైట్ సిటీ తదితర ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేస్తూంటారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే కటకటాల్లోకే..



సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, గుండాట, జూదం, అశ్లీల నృత్యాలపై నిషేధం ఉంది. నిబంధనలు అతిక్రమించి ఇటువంటి అసాంఘిక కార్యకలాలు నిర్వహిస్తే ఎంతటి వారైనా సరే చట్టపరమైన అరెస్టు చేస్తాం. కోడి కత్తులు తయారు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అసాంఘిక కార్యకలాపాలపై డయల్ 100కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ

విస్తృతంగా దాడులు

జిల్లా వ్యాప్తంగా బరులు ఏర్పాటు చేసే 40కి పైగా ప్రాంతాలపై అధికార యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. సంక్రాంతి సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కోడిపందేలు, గుండాటలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటోంది. వీటి నిర్వహణకు సిద్ధమవుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా అంతటా ప్రత్యేక పోలీసు బృందాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో దాడులు చేసి, 1,075 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కత్తులు తయారు చేస్తున్న వారిని కూడా అరెస్టు చేశారు. కోడి కత్తులు తయారు చేస్తున్నారన్న ముందస్తు సమాచారంతో గోకవరం మండలం రవీంద్ర కాలనీ బీఎస్ఆర్ కాలేజీ వెనుక ప్రాంతంలో పోలీసులు దాడి చేశారు. 223 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న కోడి కత్తులు, నిందితులను చూపుతున్న పోలీసులు

15న తిరువాభరణ మహోత్సవం



విలేకర్లతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శబరిమలై తరహాలో గోదావరి తీరాన నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీన తిరువాభరణ మహోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీ ధర్మశాస్త ఆధ్యాత్మిక కేంద్రం పాలక మండలి చైర్‌పర్సన్ జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. దానవాయిపేటలోని జక్కంపూడి నివాసం నుంచి 15వ తేదీ మధ్యాహ్నం 1.45 గంటలకు కేరళ వాయిద్యాలు, కోలాటాలు, డోలు, సన్నాయి మేళం, కేరళ నృత్యాలు, భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపు ప్రారంభమవుతుందన్నారు. టీటీడీ కల్యాణ మండపం, నందం గనిరాజు జంక్షన్, జక్కంపూడి చౌక్, దేవీచౌక్, లక్ష్మీవారపుపేట, మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్, టి.నగర్ విశ్వేశ్వరస్వామి గుడి మీదుగా అయ్యప్ప ఆలయానికి ఈ ఊరేగింపు చేరుతుందన్నారు. సాయంత్రం 6.15 గంటలకు అయ్యప్ప స్వామికి ఆభరణాలు అలంకరించి, 6.45 గంటలకు మకరజ్యోతి దర్శనం కల్పిస్తారన్నారు. రాత్రి 10 గంటలకు పవళింపు సేవ, ప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. సమావేశంలో సభ్యులు చల్లా శంకరరావు, పాలసానపల్లి హనుమంతరావు, ఆమంచి ఆంజనేయ గురుస్వామి, తోట సుబ్బారావు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై అవగాహన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల విధుల్లో పాల్గొనే వారు, ఎలక్టర్లు పోస్టల్ బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేయడానికి అర్హులని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో జరుగుతున్న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణలో రెండో రోజైన శుక్రవారం ఆమె మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును సాధ్యమైనంత ఎక్కువ మంది వినియోగించుకునేలా చూడాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో క్యాట్ ఫారాలపై అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోని వారిని చైతన్యపరచాలని చెప్పారు. సిబ్బందికి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పూర్తిగా అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మలో ధైర్యం నింపిన త్రిజట స్వప్నం



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'అకాలో దుర్లభో మృత్యుః' అని పండితులు చెబుతారని, కాని కాలంలో మృత్యువు కూడా కరుణించదని సీతమ్మ భావిస్తుందని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో శ్రీరామాయణం 31వ రోజు ప్రవచనాన్ని శుక్రవారం ఆయన కొనసాగించారు. రావణుని హెచ్చరికలు, రాక్షస కాంతల బెదిరింపులతో సీతమ్మ తల్లి ఆలోచన పరిపరివిధాల పోయిందన్నారు. 'నా కన్నీటి చుక్కలు రామబాణాలుగా మారి, రావణుని అంతం చేయక మానవు. రామబాణాలకు ఈ సాగరం ఒక అడ్డంకి కాదు. అయినా రాముడు నన్ను ఎందుకు ఆదుకోవడం లేదు? రాముడు రాజర్షి. ఆయనకు నాతో పని లేదనుకోవాలా? రావణుడు కపటోపాయంతో ఆయనను వధించాడా.. అని సీతమ్మ ఆలోచిస్తున్న తరుణంలో.. త్రిజట తన స్వప్న వృత్తాంతాన్ని రాక్షస కాంతలకు చెబుతుంది. రాముని విజయం, రావణుని పరాజయం, సీతారాముల పునస్సమాగమం ఈ కలలో నాకు కనపడిందని చెబుతుంది. ఇది విన్న సీతమ్మలో ధైర్యం, రాక్షస స్త్రీలలో భయం కలుగుతాయి. సీతాదేవిని శరణు కోరితే, మహా భయాల నుంచి విముక్తి కలుగుతుంది. మహాభయమంటే సంసారమే' అని సామవేదం అన్నారు. స్వప్న శాస్త్రమంటే మన వాళ్లు ఫ్రాయిడ్ పేరు చెబుతారని, అంతకు ముందే ఆత్రేయ మహర్షి ఈ శాస్త్రాన్ని మనకు అందించారని చెప్పారు. అలాగే, ఆర్థిక శాస్త్రమంటే ఆడమ్ స్మిత్ అంటారని, అంతకు వేల సంవత్సరాలకు ముందే కౌటిల్యుడు అర్థశాస్త్రాన్ని మనకు అందించాడని తెలిపారు. భారతీయులకు శాస్త్ర స్పృహ తప్ప అన్ని శాస్త్రాలూ ఉన్నాయని అన్నారు. శాస్త్రాల్లో ఆపదలకు నివారణోపాయాలు కూడా కనపడతాయని, శాస్త్రాలు జాగ్రత్త పెట్టడానికే కానీ భయ పెట్టడానికి కాదని అన్నారు. స్వప్నాలను బట్టి రోగాలను నిర్ధారించడం కూడా ఉందని, శాస్త్రాల పట్ల నిర్లక్ష్య ధోరణి తగదని హితవు పలికారు. చెడు విన్నా, చూసినా దోషం కలుగుతుందని, ఆ దోషాన్ని పరిహరించే గుణం దూర్వాానికి ఉందని చెప్పారు. అందువల్లనే రావణుడు మాట్లాడే సమయంలో సీతాదేవి దూర్వాన్ని అడ్డు పెట్టుకుంటుందని సామవేదం అన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ నిఘా శాఖ దాడులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ విజిలెన్స్, యాంటీపవర్ తెఫ్ట్ స్క్వాడ్ పోలీస్ ఇన స్పెక్టర్ కె.నాగమోహనరెడ్డి, హెచ్చరిక జారీ చేశారు. గురువారం రాత్రి రాజవోలు గ్రామంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న తేజ డైరీపై దాడులు నిర్వహించగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి ముద్దాయికి రూ.2,67,374 అపరాధ రుసుం, 17,000 జరిమానా విధించినట్లు నాగమోహనరెడ్డి శుక్రవారం తెలిపారు.

17న అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో గల తిరుమల విద్యాసంస్థలలో ఐదు నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈనెల 17వ తేదీ ఉదయం 10.00 గంటలకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హాజరు కావాలనుకొనే తల్లిదండ్రులు, విద్యార్థులు రాజమహేంద్రవరం క్యాంపస్ కోసం డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.తిరుమల ఈడీయూ.కామ్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విశాఖపట్నం క్యాంపస్‌లో జరిగే సదస్సుకు హాజరుకావాలనుకొనేవారు ఆ క్యాంపస్‌లో అదే తేదీన నేరుగా సంప్రదించవచ్చన్నారు. 2023లో ఐఐటీ/ఎన్ఐటీ/ఐఐఐటీ/బిట్స్‌లలో 646 మంది విద్యార్థులు సీట్లు సాధించారని, ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 233 మందిలో 14మంది ఎయిమ్స్‌లో సీట్లు సాధించారన్నారు.

రైలులో కడుపు నొప్పి తాళలేక బంగ్లాదేశ్ వాసి మృతి

తుని: చెన్నైలో వైద్యం కోసం కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తుండగా మార్గమధ్యంలో కడుపునొప్పికి గురై మరణించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాల ప్రకారం షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన మహ్మద్ ఆలంగిర్ హుస్సేన్(36) తన మేనమామ కుమారునితో వైద్యం కోసం వెళ్తున్నారు. తుని సమీపంలోకి రైలు చేరుకునే సరికి హుస్సేన్‌కు కడుపులో గ్యాస్ సమస్య తలెత్తి నొప్పి తీవ్రంగా రావంతో రైలును తుని రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని తుని రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లారు. వెంటనే వైద్యుడు పరిశీలించి అప్పటికే హుస్సేన్ మృతి చెందినట్టు నిర్ధారించారు. దీనిపై ఎస్సై అబ్దుల్‌మారూఫ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా హుస్సేన్ పాస్‌పోర్టు, వీసా పరిశీలించి మృతుని బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో మార్చురీకి పంపించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోకవరం: కారును బైక్ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందినట్టు గోకవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...రంపచోడవరం మండలం తామరపల్లికి చెందిన కుంజం అఖిల్‌కుమార్ (28) బైక్‌పై రంపచోడవరం వైపు నుంచి గోకవరం వైపు వస్తుండగా బీఎస్ఆర్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న కారుని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న గోకవరం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్సై యువి శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాత బాగుంటే మార్కుల పంటే!

- దస్తూరీ సాధన చేస్తే మంచిదంటున్న నిపుణులు
- టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఆసన్నమైన సమయం


రాయవరం: పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇప్పటికే బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశాయి. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. డిగ్రీ, వృత్తి విద్యా కోర్సుల వార్షిక పరీక్షలు మరి కొద్ది నెలల్లో రానున్నాయి. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకుని చదవడం ప్రారంభించారు. విద్యాశాఖ అధికారులు కూడా ప్రత్యేక ప్రణాళికను పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. పరీక్షల్లో ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయడం ఎంత ముఖ్యమో, చేతిరాత కూడా అంతే ముఖ్యమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. చేతిరాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు. దస్తూరీ బాగా లేకుంటే..సమాధానం అర్థంకాక ఒక మార్కు, లేదా అర మార్కు అయినా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావం టోటల్ మార్కులపై పడుతుంది. అందువల్ల విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. విద్యార్థులు రోజుకు అరగంట అయినా చేతిరాతపై సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



చేతిరాత ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థి

మార్కుల సాధనకు చేతిరాత కీలకం

మన చేతిరాతను బట్టి కూడా మన మనస్తత్వాన్ని, గుణగణాలను కూడా అంచనా వేయవచ్చునని నిపుణులు చెబుతారు. పరీక్షల్లో చేతిరాత కీలకంగా మారుతుంది. అందంగా రాసే అక్షరాలకు వచ్చే అదనపు మార్కులే మంచి ఫలితాలు అందిస్తాయి. పరీక్షల్లో ఫలితాన్ని, భవితను నిర్దేశించేది అందమైన అక్షరాలేనని విషయ నిపుణులు పేర్కొంటున్నారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు, గ్రేడులు సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటారు. చేతిరాత గురించి మాత్రం పట్టించుకోరు. దీంతో అనుకున్న మార్కులు పొందలేక పోతుంటారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంచుకుంటే మంచి రాత వస్తుంది.



అందమైన చేతిరాత

ఇవీ సూచనలు

- ప్రతి విద్యార్థి జవాబు పత్రాల బుక్‌లెట్‌లో సమాధానాలు స్పష్టంగా రాయాలి.
- నాలుగు వైపులా మార్జిన్లు(బార్డర్లు) వేసుకుంటే మంచిది.
- ఒక లైనుకు మరో లైనుకు సెంటీమీటర్ గ్యాప్ ఇవ్వాలి.
- అక్షరాలు మరీ పెద్దవి, చిన్నవిగా ఉండకూడదు. పేపరంతా ఒకే స్థాయిలో అక్షరాలు ఉండాలి.
- గుండ్రంగా, అందంగా రాస్తే మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.
- గొలుసులా అక్షరాలను రాస్తే మంచి మార్కులు వచ్చే అవకాశం ఉండదు.
- బుక్‌లెట్‌లో వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి.
- బొటన వేలు, మూడవ వేలికి మధ్య చూపుడు వేలు సహాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వలన రాసే సమయంలో పెన్ను స్పీడుగా ముందుకు కదులుతుంది.
- పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై కూడా పడుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తుంది.

జిల్లా వ్యాప్తంగా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 70వేల మంది విద్యార్థులు వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. లక్ష మందికి పైగా విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ఏడాదంతా చదివినది పేపరుపై పెట్టే సమయం సమీపిస్తోంది. చేతిరాత బాగుంటే విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. పరీక్షల సమయంలో ఇటు సబ్జెక్టులకు సన్నద్ధం అవుతూ మరోవైపు రోజులో కొంత సమయం చేతిరాతపై దృష్టి సారిస్తే పట్టు వస్తుంది.

ప్రత్యేక శ్రద్ధ



దస్తూరీ అందంగా ఉండేలా విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నాం. చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. చేతిరాత అందంగా ఉంటే పేపరు వాల్యుయేషన్ చేసే టీచర్‌కు విద్యార్థిపై మంచి అభిప్రాయం ఏర్పడుతుంది.

– చిట్టినీడి నిరంజని, జెడ్పీహెచ్ఎస్, మామిడికుదురు, మామిడికుదురు మండలం

సాధనతోనే సాధ్యం



చక్కటి చేతిరాత రావాలంటే సాధనతోనే సాధ్యమవుతుంది. చేతిరాతను అభివృద్ధి చేసుకునేందుకు ప్రతీ రోజు కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. తొలి ప్రశ్న నుంచి చివరి ప్రశ్న వరకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.

– ఎం.చంద్రకళ, హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, ఉచ్చిలి, ఆత్రేయపురం మండలం.

కుమార్తె స్మారకార్థం సైన్స్ పోటీలు

- 21న రేవతి సైన్స్ అవార్డు పోటీలు
- బాలికలకు ప్రత్యేకంగా ప్రయోగ పోటీలు

రామచంద్రపురం: ఆయనో సైన్స్ ఉపాధ్యాయుడు. నిత్యం సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటారు. తన కుమార్తెను సైంటిస్ట్‌గా చూడాలని కలగన్నారు. విధిరాత మరోలా ఉండడంతో.. అనారోగ్యంతో కుమార్తె మరణించింది. దీంతో తన కుమార్తె పేరిట ప్రతి ఏటా సైన్స్ అవార్డులను ఇస్తూ బాలికలను ప్రోత్సహిస్తున్నారు రామచంద్రపురం పట్టణానికి చెందిన కె.శ్రీకృష్ణసాయి.

- బిక్కవోలు మండలం కొంకుదురులో సైన్స్ ఉపాధ్యాయుడిగా శ్రీకృష్ణసాయి పనిచేస్తున్నారు. రామచంద్రపురంలో ఆయన తన కుమార్తె రేవతి పేరిట సైన్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఏటా జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించి, అవార్డులు అందజేస్తున్నారు. ఈ ఏడాది కూడా నేషనల్ గర్ల్ చైల్డ్ డే పేరిట మూడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. సైన్స్ ప్రయోగాల్లో నిర్వహించే పోటీల్లో 5, 6, 7 తరగతులకు ఫన్ సైన్స్ విభాగంగా, 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు ఫన్ ఫిజిక్స్, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఫన్ మ్యాథ్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.



రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకృష్ణసాయి

- సైన్స్ మోనో యాక్టింగ్ పోటీలను గ్రూపుఎ, గ్రూపు బిలకు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు పోటీలు నిర్వహిస్తారు. ఏ సైంటిస్ట్‌నైనా అనుకరణ చేయవచ్చు. మూడో విభాగంలో భాగంగా సైన్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సైన్స్ ఇన్ నేచర్ అంశంపై సైన్స్ చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. http://bit.ly/revathiscienceawards 2024 లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. రిజిస్ట్రేషన్స్‌కు ఈ నెల 14వ తేదీ గడువుగా నిర్ణయించారు.

బహుమతులివే..

సైన్స్ ప్రయోగాల పోటీల్లో ఏ, బీ, సీ విభాగాల్లో రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు. సైంటిస్ట్ మోనో యాక్షన్ పోటీల్లో విజేతలకు రూ.2,500, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులను అందజేస్తారు. సైన్స్ చిత్రలేఖనం పోటీల్లో వరుసగా రూ.1,500, రూ.వెయ్యి, రూ.500 నగదు బహుమతులు ఇస్తారు.

ఈ హరిదాసు..మన సరిహద్దు జవాన్

నల్లజర్ల: సంక్రాంతి పర్వదినాలలో ఉదయమే అక్షయ పాత్ర తలపై ఉంచి ఒక చేత్తో తంబుర, మరో చేత్తో చిడతలు వాయిస్తూ హరిలోరంగ హరి అంటూ హరినామస్మరణ చేసే హరిదాసును ఏటా మనం చూస్తూనే ఉంటాం. వంశపారం పర్యంగా వస్తున్న ఈ వృత్తిని స్వీకరించిన మూడోతరం హరిదాసు బెజవాడ సతీష్. ఈయన స్వగ్రామం భద్రాచలం సమీపంలోని రామనగరం. సతీష్ ఉద్యోగ రీత్యా సరిహద్దు జవాను. సంక్రాంతి పర్వదినాలలో సెలవుపై వచ్చి మండలంలోని చీపురుగూడెం, పోతవరం, కవులూరు తదితర గ్రామాలలో తిరుగుతుంటారు. తాత చిన్ని కృష్ణ తర్వాత తండ్రి నరసింహారావు ఆయన గతించిన తర్వాత సతీష్ ఈ వృత్తిలోకి వచ్చారు. ఎంత చదువు చదివినా, ఏ ఉద్యోగం చేస్తున్నా వంశపారం పర్యంగావచ్చే ఈ వృత్తి వీడ లేదు సతీష్. తెల్లవారుఝామున 3గంటలకే నిద్రలేచి స్నానాది పూజాకార్యక్రమాలు ముగించి హరినామ సంకీర్తనలు పాడుతూ గ్రామ,గ్రామాన తిరుగుతుంటారు. దాదాపు 10గ్రామాలు తిరిగాక శిరస్సుపై ఉంచిన కలశాన్ని దించి మళ్లీ స్నానం చేశాకే భోజనం చేస్తారు. ఇది తమకు ఆనవాయితీగా వస్తున్నదని సతీష్ వివరించారు. ఇటీవల హరిదాసులంతా మోపెడ్‌లపై తిరుగుతూ హరినామ సంకీర్తనలు సైతం రికార్డు చేసి లౌడ్ స్పీకర్లలో వినిపిస్తూ ఉంటే ఈయన మాత్రం కాలినడకనే హరినామ సంకీర్తన చేస్తూ తిరుగుతూ కనిపిస్తారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమ తండ్రి ఈ విధంగానే తిరగాలని చెప్పారని వివరించారు. తాత,తండ్రిల నుంచి వచ్చిన తంబుర, చిడతలు, కలశంనే ఆయన వినియోగిస్తున్నారు.



హరిదాసుగా బీఎస్ఎఫ్ జవాను బెజవాడ సతీష్

కరెంట్ తీగలు తగిలి వ్యక్తి మృతి

జగ్గంపేట: మండలంలోని కాండ్రేగుల గ్రామంలో అడవి పంది లకోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఒక వ్యక్తి మృతి చెందాడు. అయితే ఈ విషయం ఎవరికీ తెలియకూడదని ఏకంగా అతని మృతదేహాన్ని చెరువు ఊబిలో కర్రలతో పాతి పెట్టేశారు. మృతుడు వెంట వెళ్లిన వ్యక్తులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు అందించిన వివరాల ప్రకారం కాండ్రేగుల గ్రామ శివారులో పొలాల వద్ద అడవిపందులను వేటాడేందుకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి కరెంట్ తీగలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి అర్ధరాత్రి వచ్చిన కుందేళ్ల వేటగాడు, ప్రత్తిపాడు గ్రామానికి చెందిన మేకల కార్తీక్ (30)కు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కరెంట్ తీగలు అమర్చిన వ్యక్తులు కార్తీక్ మృతదేహాన్ని ఎవరికి అనుమానం రాకుండా చెరువులో పడేస్తే బయటకు తేలిపోతుందని చెరువులోని ఊబిలో కర్రల సాయంతో పాతేసారు. అయితే మృతుడు కార్తీక్ కూడా వచ్చిన అతని తమ్ముడు అజయ్, మరో వ్యక్తి ఈ విషయాన్ని గమనించి భయంతో అక్కడ నుంచి పారిపోయి జగ్గంపేట వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో గాలింపు చేపట్టారు. దీంతో కార్తీక్ మృతుదేహం బయటపడింది. మృతుడుకి భార్య, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. పొట్టకూటి కోసం వచ్చి ఇలా మృత్యువాత పడడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. కరెంటు తీగలు అమర్చి, ఒక వ్యక్తి మృతికి కారణమైన వ్యక్తులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.



కాండ్రేగుల చెరువులోంచి బయటకు తీసిన కార్తీక్ మృతదేహం

ఉత్కంఠగా గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు

ఉభయ గోదావరి జిల్లాల నుంచి 160 మంది క్రీడాకారుల రాక

అమలాపురం టౌన్: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువకుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం 2వ గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. ఉభయ గోదావరి జిల్లాల నుంచి దాదాపు 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాడీ బిల్డింగ్, మాస్టర్స్, దివ్యాంగ, ఫిజిక్స్ స్పోర్ట్స్ ఈ నాలుగు విభాగాల్లో క్రీడాకారులు పోటా పోటీగా తమ సత్తా చాటారు. పోటీలను కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు ప్రారంభించారు. తొలుత జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో పలువురు క్రీడా అసోసియేషన్ల ప్రతినిధులు మాట్లాడుతూ యువతలో బాడీ బిల్డింగ్ పట్ల ఆసక్తి పెంచడమే కాకుండా స్వామి వివేకానంద యువ స్ఫూర్తిని నింపుతున్న బాడీ బిల్డింగ్ జిల్లా అసోసియేషన్‌ను అభినందించారు. పోటీలు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ సాగాయి. హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ పోటీలను పర్యవేక్షించారు. కేటగిరీలగా సాగిన పోటీల ఈవెంట్స్‌లో ఎప్పటికప్పుడు విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. పోటీలకు జడ్జిలుగా నేషనల్ రిఫరీస్ వి.శ్రీనివాసరాజు, చల్లా శ్రీనివాస్, ఎం.పోలయ్య, డి.కృష్ణ వ్యవహరించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు గారపాటి శేఖర్, కోశాధికారి దొమ్మేటి వెంకటరమణ, కోనసీమ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, అల్లాడ శరత్ పాల్గొన్నారు.



ప్రారంభ కార్యక్రమంలో శరీర సౌష్టవాన్ని ప్రదర్శిస్తున్న కండల వీరులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై వినయ్‌ప్రతాప్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన పసపులేటి రవికుమార్ (33) ఇంటి నిర్మాణం నిమిత్తం అప్పులు చేశాడు. వడ్డీలు పెరగడంతో అప్పుల బాధ తాళలేక ఈ నెల 8న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు తునిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అల్లిపూడి ఎంపీటీసీ నాగమణి మృతి

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి ఎంపీటీసీ నెమ్మది నాగమణి (40) శుక్రవారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆమె మృతికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఎంపీపీ లగుడు శ్రీనివాస్, అల్లిపూడి సర్పంచ్ నూకాలమ్మ సంతాపం తెలిపారు.